ఫుట్‌పాట్లు..!

పాదచారికి.. ఏదీ దారి.!

- యలమంచిలి పట్టణంలో కానరాని ఫుట్‌పాత్‌లు
- ఉన్న వాటిపై వ్యాపారాల నిర్వహణ
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



భవనం వీధిలో రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్



ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో పట్టణంలో ప్రధాన రహదారిపై నడిచి వెళ్తున్న పాదచారులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో నడకదారులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి, ముఖ్య కూడళ్ల వద్ద ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. తోపుడు బండ్లు, పూలు, పండ్లు, స్వీట్ బండ్లు, పానీపూరీ, కూరగాయలు, బజ్జీల బండ్లు, గాజుల దుకాణాలు, పండ్ల దుకాణాలు, ఇలా పలు రకాల వ్యాపారులంతా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారు. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల ముందున్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి నెలకు వేల రూపాయలను అద్దెగా వసూలు చేసుకుంటున్నారంటే పట్టణంలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్లపై నడవడానికి జనం ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా, దిమిలి రోడ్డు కూడలి, బజారు వీధి, దిమిలి రోడ్డు, సైతారుపేట రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్లకిరువైపులా ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాలు ఎటువైపు నుంచి తమపైకి దూసుకొస్తాయోనని, ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు భయంతో నడక సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టణంలోని మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నడకదారుల్లో ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు

పాదచారుల బాట ఎలా ఉండాలనే అంశం ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ)స్పష్టంగా చెబుతోంది. రోడ్డు ఉపరితలానికి కనీసం ఒకటిన్నర అడుగు ఎత్తులో, 2.50 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఉండాలి. ప్రాంతాన్ని బట్టి వెడల్పులో స్వల్ప మార్పులు ఉంటాయి. ఇంత కంటే గొప్ప ప్రమాణాలతో పాదచారుల బాటలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను పట్టణ ప్రజలు కోరుతున్నారు. అయితే పట్టణంలో ఇప్పటికే నిర్మించిన, కొత్తగా నిర్మిస్తున్న రోడ్లలో ఎక్కడా ఫుట్‌పాత్‌లు కనిపించడంలేదు. ఉనన వాటినీ వినియోగంలోకి తీసుకురావడంలో కూడా యంత్రాంగం విఫలమవుతూనే ఉంది.

మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఆక్రమణలు

పట్టణంలోని ఆక్రమణలు తొలగించాల్సిన యంత్రాంగం కార్యకలాపాలు నిర్వహించే మున్సిపల్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని స్థానిక వ్యాపారులు ఆక్రమణలకు దిగడం అధికారుల ఉదాసీనతకు నిదర్శనంగా చెప్పొచ్చు. కార్యాలయం వద్ద గతంలో ఉండే ఆక్రమణలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తొలగించారు. కార్యాలయం ప్రహరీ ఉన్నంత వరకు ఎక్కడా రోడ్డు పక్కన ఎటువంటి దుకాణాలు పెట్టకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణల జోరు పెరిగింది. కార్యాలయం ముఖ ద్వారాన్ని కూడా వదలకుండా చిల్లర వ్యాపారులు అమ్మకాలు చేపడుతున్నారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలున్నాయి.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

పట్టణంలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు అనువైన స్థలాలు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారి, భవనం వీధి, త్తపేట, గాంధీనగరం, రాంనగర్–పెదపల్లి రోడ్డు సహా పలు అంతర్గత రహదారులకిరువైపులా వాణిజ్య భవనాలు, పెద్ద షాపింగ్ మాల్స్, ప్రైవేటు కార్యాలయాలకు ఎదురుగా రహదారులపైనే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, వ్యాన్లు నిలిపి ఉంచుతున్నారు. హోటళ్లు, వస్త్ర, కిరాణా దుకాణాల ముందు ఎక్కడపడితే అక్కడ బైకులను నిలిపివేస్తున్నారు. ఒక్కోసారి అంతర్గత రహదారులకు రెండు పక్కలా ద్విచక్ర వాహనాలు ఉంచడంతో వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంటోంది. పలు భవనాల సెల్లార్లలో కూడా దుకాణాలు ఏర్పాటు చేసుకుని మరీ దర్జాగా వ్యాపారాలు చేసుకుంటూ అక్కడ కొచ్చే వినియోగదారులు, దుకాణాల్లో పని చేసే సిబ్బంది వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది.



కాలేజీ కూడలి వద్ద ఆక్రమణలు ఇలా..

ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణ



పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా నడిచి వెళ్లడానికి ఆస్కారం లేకుండా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. రోడ్డుపై నుంచే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలి.

– సీహెచ్ నవీన్,ప్రై వేటు ఉద్యోగి,పాతవీధి,యలమంచిలి

చాలా ఇబ్బంది పడుతున్నాం..



పిల్లలతో నడిచి వెళుతున్న మహిళలు, వృద్ధులు ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. నడిచి వెళ్లడానికి వీల్లేకుండా రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీని వల్ల రోడ్లపై వేగంగా వచ్చే వాహనాల నుంచి తప్పుకోలేక భయభ్రాంతులకు గురవుతున్నాం.

– బండారి కరుణ, యలమంచిలి

ఆక్రమణలు తొలగిస్తాం..



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై నడిచే పాదచారుల ఇబ్బందులను పరిష్కరించడానికి పాలక వర్గంతో చర్చిస్తాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయకూడదు. దీనిపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



పదవీ విరమణ చేసిన రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈవో బుద్ద శివనాయుడు అన్నారు. మండలంలోని నాగులాపల్లి దళితవాడలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాజ్యలక్ష్మిని శనివారం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని, అటువంటి వృత్తికి రాజ్యలక్ష్మి న్యాయం చేసి అందరి మన్ననలు పొందారన్నారు. దళిత బహుజన యువజన సేవా సంఘం అధ్యక్షుడు డొక్కా శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఆటల పోటీలు



కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థులు

నక్కపల్లి: మండలంలో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఆటలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు 3నన బహుమతులు ప్రదానం చేస్తామని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ యాస్మిన్ తెలిపారు.

పేరుకుపోతున్న చెత్త



రామన్నపాలెం శివారున మెయిన్‌రోడ్డులో పేరుకుపోతున్న చెత్త

కోటవురట్ల: పల్లెల్లో చెత్త పేరుకుపోతోంది. నెలల తరబడి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. సంపద కేంద్రాలు ఉన్నా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. దాంతో రహదారులే చెత్త కేంద్రాలుగా మారిపోతున్నాయి. రామన్నపాలెం, జల్లూరు, రాజుపేట శివారు రామన్నపాలెం తదితర గ్రామాల రహదారుల వెంబడి చెత్తను పడేస్తున్నారు. దోమలు వ్యాప్తితో రోగాలు ముసురుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

8న సాగునీటి సంఘాల ఎన్నికలు

పాయకరావుపేట: ఈ నెల 8న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ జి.సత్యనారాయణ, నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని 24 గ్రామాల పరిధిలో 7 సాగునీటి కాలువల ద్వారా రైతులకు సాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. భూమి కాలువ పరిధిలో 1692 మంది రైతు ఓటర్లు, ఆవ చానల్ పరిధిలో 205 మంది, మాసాహెబుపేట చానల్ పరిధిలో 975, మంగవరం చానల్ పరిధిలో 913, రాజవరం చానల్ పరిధిలో 403, కనుమల చెరువు పరిధిలో 384 మంది రైతు ఓటర్లు ఉన్నారని చెప్పారు.

గణపర్తి- జోగారావుపేట రోడ్డు బురదమయం



బురదగా ఉన్న గణపర్తి-జోగారావుపేట రోడ్డు

మునగపాక: "ణపర్తి నుంచి జోగారావుపేట వరకు ఉన్న రోడ్డు బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది మంది పలు పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. పక్కారోడ్డు నిర్మాణం కాకపోవడంతో మట్టిరోడ్డే దిక్కయింది. ఈ రోడ్డు ప్రస్తుతం బురదమయంగా దర్శనమిస్తోంది. వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ



పెద బోదిగల్లం పాఠశాలలో గురజాడ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: నవయుగ వైతాళికుడు గురజాడ వెంకటప్పారావు వర్ధంతి సందర్భంగా శనివారం పెద బోదిగల్లం పాఠశాలలో ఆయన చిత్ర పటానికి హెచ్ఎం సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించారన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో గురజాడ ఒకరన్నారు. గురజాడ రచనలు ఈ నాటికి ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యాశుల్కం నాటకం సమాజంలో గొప్ప మార్పునకు దోహదపడ్డాయన్నారు. విద్యార్థులు అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫాల్గుణరావు, చిన్నారావు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గొడిచర్ల హైస్కూల్‌లో డీవైఈవో తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు

నక్కపల్లి: గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అనే వివరాలను ఆరా తీశారు. మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్‌ను సరిగ్గానే నిర్వహిస్తున్నారా? లేదా? అన్నది పరిశీలించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం త్వరలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారు. సమావేశానికి తల్లిదండ్రులంతా వచ్చేలా సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

సైన్స్ లిటరేచర్‌పై అంతర్జాతీయ సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ అండ్ లిటరేచర్ ప్రభావం, ప్రేరణ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. సెర్బియా, ఇథియోపియా, వియత్నాం, దక్షిణ కొరియా, శ్రీలంక, నేపాల్ దేశాలకు సంబంధించిన అనేక మంది ఆచార్యులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు రిసోర్స్‌పర్సన్లుగా ఆన్‌లైన్. ఆఫ్‌లైన్ విధానాల్లో పాల్గొని పలు అంశాలపై పత్ర సమర్పణలు చేశారు. న్యూఢిల్లీకి చెందిన అస్తిత్వ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు డీఎస్ శ్రీవాస్తవ గౌరవ అతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. సెర్బియా దేశానికి చెందిన ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ విక్టర్ రాడాన్ థియోన్ మాట్లాడుతూ సైన్స్, సాహిత్యాలు అనాది కాలం నుంచి సమాజంలో విడదీయలేని విధంగా ఉన్నాయన్నారు. వీటి ప్రభావం పరస్పరం విరుద్ధంగా అనిపించినా, వాటి అంతిమ లక్ష్యం సమాజ హితమేనని చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన ఆచార్యుడు డాక్టర్ సు . దీర్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ సాహిత్యంలో సైన్స్ అంతర్భాగమని, సైన్స్ ప్రకృతిని, భౌతిక పదార్థాలను అధ్యయనం చేస్తే, సాహిత్యం మానవ భావోద్వేగాలను అధ్యయనం చేస్తుందని, ఈ రెండింటి అధ్యయనం సమాజ హితమేనని చెప్పారు. ఇథియోఫియా దేశానికి చెందిన కుమారి సిబ్లివంగల్, తెంస జెన్ యాకోబ్‌లు సాహిత్యంలో సైన్స్ అనే అంశంపై తమ ప్రసంగాలు చేసి, సెమినార్ పత్రాలను సమర్పించారు. అనంతరం జరిగిన వివిధ సమావేశాలకు రాష్ట్రంలోని పలు కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు ఆఫ్‌లైన్ ,ఆన్‌లైన్ పద్ధతిలో సెమినార్ పత్రాలు సమర్పించారు. కార్యక్రమ కో–కన్వీనర్ డాక్టర్ కె.సుజాత, వీఏ సత్యనారాయణ, ప్రేమ సాగర్, ఐశ్వర్య, రమ్య, పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌కు చెందిన విశిష్ట అతిథి డాక్టర్ రామ చంద్ర రాయ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ, కన్వీనర్ డాక్టర్ కర్రి సుధ పాల్గొన్నారు.

డెయిరీ రైతుల నిరసన



కొక్కిరాపల్లిలో నిరసన తెలుపుతున్న విశాఖ డెయిరీ రైతులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి గ్రామంలో శనివారం విశాఖ డెయిరీ పాడి రైతులు నిరసన తెలిపారు. విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాలు సేకరణ ధరను పెంచాలని, ఫీడ్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. వారికి సీఐటీయూ, రైతు సంఘం ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్.శివాజీ మాట్లాడుతూ విశాఖ డెయిరీ అర్థాంతరంగా ఆవు పాలు సేకరణ ధరను రూ.3 తగ్గించిందని, దీనిని వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో వున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామన్నారు. సోమవారం గాజువాక వద్ద విశాఖ డెయిరీని ముట్టడి చేయడానికి రైతులు ముందుకురావాలని కోరారు.

ఫెంగల్‌తో అన్నదాత హడల్



జల్లూరులో నేలవాలిన వరి చేలు



గణపర్తిలో నేలకొరిగిన వరి పైరు



నక్కపల్లి మండలంలో నేలకు ఒరిగిన వరి పంట

కోటవురట్ల: వాయుగుండం కాస్తా ఫెంగల్ తుపానుగా మారడంతో అన్నదాత హడలెత్తిపోతున్నాడు. తుపాను గండం తగ్గే వరకు కంటిమీదకు కునుకు వచ్చే పరిస్థితి కానరాలేదు. గింజలు ఇంటికి చేరే సమయాన ఫెంగల్ హడావుడి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఫెంగల్ తుపాను తాకిడితో మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి వర్షాలు మొదలయ్యాయి. ఈదురుగాలులు తోడవ్వడంతో వరిచేలు నేలవాలుతున్నాయి. వరి కోతలు ఆలస్యం కావడంతో గింజ రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంటను దక్కించుకునేందుకు ఏంచేయాలో పాలుపోని పరిస్థితిలో అన్నదాత అయోమయంలో పడిపోయాడు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో అత్యధికంగా వరి సాగు చేపట్టారు. మండలంలో 4,409 ఎకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం అన్ని చోట్ల దాదాపు కోతకు రాగా.. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే కోతలు చేశారు.

మునగపాక: తుపాన్ దెబ్బకు మండలంలోని ఉమ్మలాడ, తిమ్మరాజుపేట, మునగపాక, వాడ్రాపల్లి, గణపర్తి తదితర ప్రాంతాల్లో వరి పైరు నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల సముదాయానికి వెళ్లే మార్గంలో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నక్కపల్లి: తుపాను ప్రభావానికి మండలంలో భారీగా ఈదురు గాలులు వీచాయి. కాగిత, వేంపాడు, చినదొడ్డిగల్లు వెదుళ్లపాలెం, నక్కపల్లి, ఉద్దండపురం, గొడిచర్ల తదితర గ్రామాల్లో వరి పంట పక్వానికి వచ్చింది. మరికొద్దిరోజుల్లో వరికోతలు ప్రారంభంకానున్నాయి. ఈ తరుణంలో పెంగల్ తుఫాను ప్రభావం వరి పనలు నేలకు ఒరిగిపోయాయి. వీటిని సరిచేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తుపాను ప్రభావం కారణంగా కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

అడ్డూఅదుపు లేకుండా మద్యం అక్రమ రవాణా

- పోలీసుల అదుపులో ఇద్దరు కూటమి అనుచరులు
- 254 మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం అక్రమ రవాణా, బెల్టుషాపులకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. యలమంచిలి నియోజకవర్గంలో కూటమి నేతలు, వారి అనుచరులు మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. తమ దుకాణాల పరిధిలో బెల్టు షాపులకు గుట్టుచప్పుడు కాకుండా మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. పట్టణంలో కోర్టు కూడలి వద్ద పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా శనివారం పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 254 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కొక్కిరాపల్లికి చెందిన సూర్యప్రకాష్, పెదపల్లి గణేష్‌గా గుర్తించారు. వీరిద్దరికీ కూటమి నేతల అనుచరులుగా పేరుంది. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.38,862 ఉంటుందని, ఇద్దరిని అరెస్ట్ చేశామని యలమంచిలి పట్టణ ఎస్సై కె.సావిత్రి తెలిపారు. వాస్తవానికి యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో మద్యం వ్యాపారుల మధ్య విభేదాలు, పొరపొచ్చాలు ఆరంభంలోనే చోటుచేసుకున్నాయి. ఈ కారణంగా కూటమి నేతల్లో వ్యాపారుల మధ్య ఆధిపత్యపోరు ఏర్పడిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా యలమంచిలి పట్టణంలో కూటమి నేతల్లో మద్యం మంటలు రేపుతోందని చెప్పాలి.

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: పౌర హక్కులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు సూచించారు. పెదగుమ్ములూరు గ్రామంలో శనివారం సివిల్ రైట్ డే నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ, తోడ్పాటు కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ నాగరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ఎస్.రాయవరంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఎస్.రాయవరం: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరం, సర్వసిద్ధి గ్రామాల్లో శనివారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీలు, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చునన్నారు.

కౌన్సిలర్లకు తెలియకుండానే జమా ఖర్చులు

- ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం..
- యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీసిన వైస్‌చైర్మన్ గుప్తా



చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి సమక్షంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ గుప్తా

యలమంచిలి రూరల్: 'పాలకవర్గ సమావేశాలన్నింటిలో సిద్ధం చేస్తున్న అజెండాల్లో అన్ని అంశాలూ ఖర్చులకు సంబంధించినవే ఉంటున్నాయి.. జమా ఖర్చులు వార్డు కౌన్సిలర్లకు తెలియడంలేదు. వార్డుల్లో ప్రజలు మమ్మల్ని సమస్యలు, మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నాం' అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు సత్య గుప్తా అధికారులను నిలదీశారు. పురపాలక సంఘం పరిధిలో చేస్తున్న పనులకు సంబంధించి వార్డు కౌన్సిలర్లకు అవగాహన ఉంటే అంతా పారదర్శకంగా ఉన్నట్టు ప్రజలకు చెప్పడానికి వీలవుతుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన శనివారం యలమంచిలి పురపాలక సంఘం 48వ పాలకవర్గ సమావేశం కార్యాలయం సమావేశ మందిరంలో వాడీవేడిగా జరిగింది. ఈ సమావేశంలో 20 అంశాలతో అజెండాను, మరో మూడు టేబుల్ అంశాలను చర్చకు ఉంచారు. వైస్ చైర్మన్ ఆర్రెపు సత్య గుప్తా అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో లేవనెత్తిన అనేక కీలకమైన అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అధికారులు చెప్పకపోవడాన్ని తప్పుపట్టారు. ముఖ్యంగా కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణకు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.84 లక్షల నిధులు కేటాయించగా, ఇప్పటి వరకూ ఆ పనులు పూర్తికాకపోవడం దారుణమన్నారు. పనులు పూర్తి కాకుండానే బదిలీపై వెళ్లిన, ప్రస్తుతం విధుల్లో ఉన్న డీఈఈలు ఇద్దరూ కంట్రాక్టర్‌కు నిరభ్యంతర పత్రాలు ఇచ్చినట్టు తెలిసిందని, ఇది సబబు కాదన్నారు. సుమారు రూ.70 లక్షలకు పనులు పూర్తయినట్టు ఖరారు చేయడం వల్ల మిగతా పనులు అసంపూర్తిగా మిగిలిపోతాయన్నారు. నాగేంద్ర కాలనీలో 40 రోజులుగా వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గుప్తా మండిపడ్డారు. అనంతరం చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ ఇకపై సభ్యులకు తెలిసేలా పనుల వివరాలు ఉండాలన్నారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అజెండాలో అంశాలకు సభ్యులంతా ఆమోదం తెలిపారు. కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు సుంకర మరిణేశ్వరరావు, డి.నర్సింహమూర్తి, మజ్జి రామకృష్ణ, దుంగా అచ్యుతరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.